క్లుప్తంగా

మీ సేవలు వెలకట్టలేనివి



సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పోలీస్ శాఖలో మీరు అందిచిన సేవలు వెలకట్టలేనివని ఎస్పీ మాధవరెడ్డి కొనియాడారు. పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ నారాయణరావ్, సివిల్ ఎస్ఐలు వెంకటబసయ్య, వెంకటరమణ, ఆర్ఎస్ఐ సలీమ్, ఏఆర్ ఎస్ఐ రామచంద్రయ్య, డీసీఆర్బీ ఎస్ఐ ఇక్బాల్ బాషా ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై రిటైర్డు ఉద్యోగులను ఘనంగా సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ మాధవరెడ్డి విశ్రాంత జీవితం ఆయురోగ్యాలతో సుఖసంతోషాలతో హాయిగా సాగిపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, సోషల్ మీడియా సైబర్ క్రైమ్ సీఐ హేమంత్‌కుమార్, ఎస్బీ ఎస్సై ప్రదీప్ కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులతో హరిమోహన్ కుటుంబ సభ్యులు

కదిరి అర్బన్: బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ అసిస్టెంట్ డీఎం హరిమోహన్ కుటుంబ సభ్యులు సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. హరిమోహన్ మాట్లాడుతూ తన భార్య క్రిష్ణవేణి పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తోందని, ఎన్నో ఎళ్ల నుంచి తాము విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేస్తూ వస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తాము ముందు ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, వర్ష, ప్రశాంతి, లక్ష్మీ, సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న క్యాషియర్ చంద్రకళ

ముదిగుబ్బ: యూనియన్ బ్యాంక్ క్యాషియర్ చంద్రకళ సోమవారం ఎస్ఎస్‌పీ కొట్టాల, కొండగట్టుపల్లి, ముదిగుబ్బ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, నాగేంద్ర గౌడ్, ఉపాధ్యాయులు ఆంజనేయులు నాయక్, శ్రీనివాసులు, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ అఫిషియో సభ్యునిగా కందికుంట



ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకటప్రసాద్

కదిరి టౌన్: మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేతో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో కందికుంట మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జంగాలపల్లిలో ఘర్షణ

పరిగి: కొత్త న్యాయ చట్టాల ప్రకారం పరిగి మండలంలో తొలి ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలమేరకు.. మండలంలోని హొన్నంపల్లి పంచాయతీ పరిధిలోని జంగాలపల్లిలో సోమవారం గ్రామానికి చెందిన బాలాజీ.. వరుసకు సోదరులయ్యే అంజినప్ప, నరసింహప్ప, తిప్పన్నతో కొంతకాలంగా భూ వివాదం నెలకొంది. ఆస్తి గొడవల కారణంగా సోమవారం ఉదయం బాలాజీపై అంజినప్ప, నరసింహప్ప, తిప్పన్న కర్రతో దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడు బాలాజీ పరిగి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై భారతీయ న్యాయ చట్టంలో భాగంగా క్రిమినల్ కేసు బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం 118 (324 పాత ఐపీసీ సెక్షన్) కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అతిసారం నియంత్రణకు సహకరించాలి



పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: అతిసార వ్యాధి నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ప్రభుత్వ డాక్టర్ మునిచంద్రిక పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, వెంకటగారిపల్లి గ్రామాల్లో అతిసార వ్యాధి నియంత్రణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార లక్షణాలు ఏ విధంగా ఉంటాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రల ప్రాముఖ్యత గురించి వివరించారు. అతిసార నియంత్రణకు చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సురక్షితమైన తాగునీరు, డ్రైడే గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, వెంకటగారిపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి, జగరాజుపల్లి మాజీ సర్పంచ్ వనం కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సిబ్బంది అపర్ణ, లక్ష్మీనారాయణమ్మ, శివ, రాజశేఖర్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ముదిగుబ్బ: వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి రోగాలకు దూరంగా ఉండాలని డాక్టర్ రాజేంద్ర పిలుపునిచ్చారు. ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో విరేచన నివారణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆహార పదార్థాల మీద ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాటికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు



తాడిమర్రి: కాటికోటేశ్వర క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి వెండి ఆభరణాలతో పాటు వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు గదాగుండంలో స్నానాలను ఆచరించి ప్రదక్షిణలు చేశారు.



పూజలందుకున్న కాటికోటేశ్వరుడు

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలోని కాటమయ్య కొండలో వెలసిన కాటికోటేశ్వరునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆభరణాలు, పూలతో అందంగా ముస్తాబు చేశారు. ఆకుపూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

తనకల్లు: పంటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ సనావుల్లా సూచించారు. బాలసముద్రంలో సాగు చేసిన మిరప, మొక్కజొన్న, వేరుశనగ పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. మిరప పంటలో పై ముడత, కింది ముడత తెగులు సోకిందన్నారు. కింది ముడత నివారణకు ఓమైట్ 200 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాలో పిచికారి చేసుకోవాలని సూచించారు. పై ముడత కోసం ఫిప్రోనిల్ 300 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాలో పిచికారి చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్లోపేడ్ 100 ఎంఎల్ పురుగు మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పంటకు పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలంటే 75 రోజుల పంట కాలంలో కంకి వచ్చిన ఒకటిన్నర అడుగు పై భాగంలో కొనలను కత్తిరించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీహరినాయక్, వీఏఏ సాయిప్రీతి, రైతులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన



నూతన చట్టాల గురించి వివరిస్తున్న ఎస్ఐ లింగన్న



కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నల్లచెరువు: కొత్తగా అమలులోకి వచ్చిన మూడు చట్టాలపై సోమవారం నల్లచెరువు పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐపీఎస్, సీఆర్‌పీసీ, ఐఈఏ వంటి చట్టాల స్థానంలో తెచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధిన్యం అనే నూతన చట్టాలపై ఎస్ఐ లింగన్న, తహసీల్దార్ రవికుమార్‌లు వివరించారు. కొత్త చట్టాల మేరకు కేసుల నమోదు, విచారణ చేస్తామని ఎస్ఐ చెప్పారు. జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, ఆటో తదితర వాహనాల డ్రైవర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రజలకు, విద్యార్థులకు చెన్నేకొత్తపల్లి పోలీసులు అవగాహన కల్పించారు. చెన్నేకొత్తపల్లిలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, టింబక్టు కలెక్టివ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత చట్టాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కొత్త చట్టాల ప్రకారం ఫిర్యాదులు, సమన్ల జారీ వంటివి ఆన్‌లైన్ ద్వారా జరుగనున్నాయన్నారు.

వైద్యులు దేవునితో సమానం

- ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వియా సాల్మన్, వైద్యులు

ధర్మవరం అర్బన్: వైద్యులు దేవునితో సమానమని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వియా సాల్మన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవీలత అన్నారు. ధర్మవరం ఏరియా ఆస్పత్రిలో సోమవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. వైద్యులు కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మనం చేస్తున్న ఈ వైద్య వృత్తి భగవంతుడు ఇచ్చిన సేవగా భావించాలన్నారు. బిల్ అండ్ బెల్ అనేది మన వైద్యవృత్తిలో లేదని, రోగుల ఆరోగ్య పరిరక్షణే మన లక్ష్యంగా అందరూ వైద్యవృత్తి చేపట్టాలని తెలిపారు. వైద్యవృత్తిలో మరింత పరిజ్ఞానాన్ని పెంచుకున్నప్పుడే ప్రజల్లో మనకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజలు మనల్ని భగవత్ స్వరూపులుగా భావిస్తారని, వారి కష్టాన్ని గుర్తించి సరైన ఆరోగ్యాన్ని ప్రసాదించడమే డాక్టర్ల ముఖ్య లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు నజీర్, వెంకటేషులు, వివేక్ కుళ్లాయప్ప, శైలజ, హరిశ్రీనివాస్, వంశీ, నితిన్‌కుమార్, అనిల్, సురేష్, కిరణ్, బాలాజీ, చంద్రిక, నివేదిత, శర్వాణి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ



బుక్కపట్నంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



కదిరిలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి టౌన్/ కదిరి రూరల్/ ముదిగుబ్బ/ నల్లచెరువు/ గాండ్లపెంట/ పుట్టపర్తి : ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ చేపట్టారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పు కళాకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులు, దివ్యాంగులు, వీల్‌చైర్/ మంచానికి పరిమితమైన వారు, కిడ్నీ, కాలేయం, తలసీమియా బాధితులకు పింఛన్ అందజేశారు.

- కదిరి మున్సిపాలిటీ పరిధిలోని 7, 21, 25వ వార్డులతో పాటు మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పింఛన్లు అందజేశారు. అలాగే నల్లచెరువు మండల కేంద్రంలోని కనుగొండ రాయప్ప కాలనీలో సోమవారం పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే కందికుంట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- గాండ్లపెంట మండల వ్యాప్తంగా 4,330 మందికి గాను 3,876 మందికి తొలిరోజు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.
- ముదిగుబ్బ మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రశాంతంగా జరిగింది. ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.
- పుట్టపర్తి, బుక్కపట్నంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: అవ్వతాతలు, వికలాంగులు, వితంతువులకు సామాజిక భద్రతను కల్పించేందుకు సీఎం చంద్రబాబు పింఛన్ డబ్బును పెంపుదల చేశారన్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లిలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లిలో జరిగిన పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు.

యువకుడి ఆత్మహత్య



జయప్రకాశ్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి



అంత్యక్రియల్లో పాల్గొన్న యూత్ నాయకుడు చక్రధర్‌రెడ్డి



జయప్రకాశ్‌రెడ్డి (ఫైల్)

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం తరుగువాండ్లపల్లికి చెందిన ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జయప్రకాశ్‌రెడ్డి (24) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. జయప్రకాశ్‌రెడ్డి డిగ్రీ చదువుకున్నాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నా సరైనది దొరకలేదు. మరోవైపు తండ్రి సాగు చేసిన టమాట పంటకు వైరస్ సోకింది. మార్కెట్లో మంచి ధర ఉన్నప్పటికీ పంట వైరస్ కారణంగా దెబ్బతింది. మనస్తాపానికి గురైన జయప్రకాశ్‌రెడ్డి ఆదివారం రాత్రి పొలంలోకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చేతికొచ్చిన కొడుకు ఇలా అర్ధంతరంగా తనువుచాలించడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, పార్టీ యువనేత కొత్తకోట చక్రధర్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెట్పీటీసీ భర్త గోవర్ధన్‌రెడ్డి, సిద్దరాంపురం వెంకటరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి, పార్టీ బూత్ లెవల్ మేనేజర్ పతంజలి తదితరులు సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయండి

- మంత్రి సత్యకుమార్‌ను కోరిన సీఆర్ఎంటీలు



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు విన్నవిస్తున్న సీఆర్ఎంటీలు

ధర్మవరం అర్బన్: ఉపాధ్యాయ ఎంపికకు కావలసిన అర్హత.. విద్యా సంబంధిత కార్యక్రమాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన తమను విద్యాశాఖ పరిధిలోకి తీసుకొచ్చి ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ)లు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ధర్మవరంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాబ్‌జాన్ మాట్లాడుతూ సీఆర్ఎంటీలకు విద్యా సంబంధిత కార్యక్రమాల్లో 12 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. విద్యాశాఖ ద్వారా నిర్వహించే అన్ని పోస్టుల భర్తీలో సీఆర్ఎంటీలకు వెయిటేజీ ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హతల ఆధారంగా స్కూల్ అసిస్టెంట్ స్థాయి వేతనం వర్తింపజేయడంతో పాటు ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని కోరారు. 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.25 లక్షలు చెల్లించాలన్నారు. ఆరోగ్య బీమా, మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కర్‌నాయుడు, వేమనారాయణ, శ్రీరాములు, శివ, మహిళా నాయకురాలు వరలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సబ్సిడీ రుణాలివ్వాలి

ఎన్పీ కుంట: ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఆటోల కొనుగోలు, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలను ఆశ్రయించి ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కనుక ప్రభుత్వమే సబ్సిడీ రుణాలు మంజూరు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం భగత్‌సింగ్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగరాజు, అధ్యక్షుడు శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలోని హుండీ కానుకలను అధికారులు సోమవారం లెక్కించారు. 2023 సెప్టెంబరు నుంచి 2024 జూలై వరకు హుండీ ఆదాయం రూ.4,78,663 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి నరసింహరాజు, ఈఓ రవీంద్ర రాజు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ముదిగుబ్బ: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముదిగుబ్బ రైల్వే స్టేషన్ మేనేజర్ శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో రైల్వే సిబ్బంది, ప్రయాణికులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ మాట్లాడుతు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షిస్తే భవిష్యత్ తరాల వారికి ఎంతో మేలు చేసినట్లవుతుందన్నారు.

మంత్రిని కలిసిన 'హంస' సభ్యులు

అనంతపురం మెడికల్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను హంస అసోసియేషన్ నాయకులు సోమవారం అనంతపురం ఐఎంఏ హాలులో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని కలసి వారిలో హంస అసోసియేషన్ జిల్లా కన్వీనర్లు కోకిల చాముండేశ్వరి, ఎస్.మహ్మద్ షఫీ, నాయకులు శోభారాణి, అలివేలు మంగమ్మ, గిరిధర్‌రెడ్డి, అలీఖాన్, లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: చార్టెడ్ అకౌంట్ డేను పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగరాజురెడ్డి, ఆడిటర్స్ ప్రారంభించారు. మొబైల్ వాహనం ద్వారా దాదాపుగా 50 యూనిట్ల రక్తం సేకరించారు. చార్టెడ్ అకౌంట్ డేను పురస్కరించుకుని ప్రతి యేటా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడినవారమవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటీపీ బ్రాంచ్ ఆఫ్ సర్ మెంబర్స్ వరదరాజు, రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు, ఆడిటర్లు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ పూజారి మంజునాథ్ స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మవరం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని సూచించారు.

మంత్రి సత్యకుమార్ సుడిగాలి పర్యటన

ధర్మవరం: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సోమవారం ధర్మవరంలో సుడిగాలి పర్యటన చేశారు. లక్ష్మీనగర్, కొత్తపేట, శివానగర్, శంకరాపురం వార్డుల్లోని పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం ఇందిరానగర్ ఎస్సీ కాలనీలో ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శివానగర్‌లో చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించి, సాధకబాధకాలు విన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు నడపాలని వినతి



ఆర్టీసీ అధికారి హంపన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: లేపాక్షి మండలం గోపిందేవరపల్లి, శిరివరం, పులమతి, నడ్లపల్లి గ్రామాల నుంచి పట్టణంలో విద్యను అభ్యసించడానికి 50 మందికి పైగా విద్యార్థులు వస్తుంటారు. వారికి అనుగుణంగా ఆర్టీసీ బడి బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారి హంపన్నకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ గోపిందేవరపల్లి, శిరివరం గ్రామాల నుంచి విద్యార్థులు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గతంలో నడిపిన ఆర్టీసీ బడి బస్సులను తిరిగి ఆ ప్రాంతాలకు నడిపి విద్యార్థుల పాఠశాల, కళాశాల సమయానికి రావడానికి, వెళ్లడానికి సమస్యలు లేకుండా చూడాలన్నారు. నాయకులు లిఖిత్, సురేష్, విక్రమ్, విశ్వాస్ విద్యార్థులు పాల్గొన్నారు.